సాక్షి విశాఖపట్నం

శుక్రవారం ၊ 7 ၊ ఏప్రిల్ ၊ 2023



అనాథలపై 'మిషన్ వాత్సల్యం'
అనాథ పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని శిశు సంక్షేమ శాఖ ఆర్‌డీ చిన్మయిదేవి తెలిపారు. 8లో



ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం
జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. 8లో



పక్కా కమర్షియల్ 'మీటర్'
'మీటర్' పూర్తిగా ఔట్ అండ్ ఔట్ కమర్షియల్ చిత్రమని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. 8లో



న్యూస్‌రీల్

5 శాతం రాయితీతో పన్ను చెల్లింపునకు అవకాశం

డాబాగార్డెన్స్: 2023–24 ఏడాదికి జీవీఎంసీకి చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై 5 శాతం రాయితీ ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. 2023–24 ఏడాదికి గాను ఈ నెల 30లోగా ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపుదారులకు ప్రభుత్వం 5 శాతం రాయితీ కల్పించిందని చెప్పారు. పన్ను చెల్లింపుదారులు gvmc. gov. in లేదా cdm.ap.gov.in ఆన్‌లైన్ ద్వారా గాని, paytm ద్వారా గాని, లేదా అన్ని జోనల్ కార్యాలయాల్లో, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సౌకర్యం కేంద్రంలో నగదు/డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకుని, నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

10న బీఈడీ మిగులు సీట్ల భర్తీ

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 10న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల, ఐఏఎస్ఈలో కొన్ని సీట్లు మిగిలాయని, వీటిని ఎడ్‌సెట్ 2022లో అర్హత సాధించిన వారితో స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తున్నామన్నారు. ఖాళీల వివరాలు www.audoa.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు నేరుగా తమ విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లు, ఎడ్‌సెట్ ర్యాంక్ కార్డులతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

ఖోఖో పోటీల్లో సత్తా చాటిన కానిస్టేబుళ్లకు అభినందన



క్రీడాకారులతో సీపీ శ్రీకాంత్

దొండపర్తి(విశాఖ దక్షిణ): 71వ ఆలిండియా పోలీస్ అథ్లెటిక్స్ క్లస్టర్స్ మీట్‌లో ఖోఖో విభాగంలో కాంస్య పతకం సాధించిన రాష్ట్ర పోలీస్ జట్టులో సభ్యులుగా ఉన్న విశాఖకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ అభినందించారు. నగరానికి చెందిన ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లు ఎం.కనకరాజు, బి.నాగరాజు రాష్ట్ర ఖోఖో జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తూ జట్టుకు కాంస్య పతకం రావడంతో కీలకపాత్ర పోషించారు. గురువారం కమిషనరేట్‌లో కానిస్టేబుళ్లను సన్మానించడంతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులను, జీఎస్ఈలను ప్రకటించారు. కార్యక్రమంలో ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ శాంతికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'స్థాయీ' సమావేశంలో అంశాలన్నీ ఆమోదం

డాబాగార్డెన్స్: జీవీఎంసీకి చెందిన దుకాణాలు, కల్యాణ మండపాల లీజు, ఆశీల వసూళ్లకు స్థాయీ సంఘం సభ్యులు ఆమోదం తెలిపారు. మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన గురువారం స్థాయీ సంఘ సమావేశం జరిగింది. మొత్తం 57 అంశాలు పొందుపరచగా.. అన్ని అంశాలను సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి ఆశీల వసూళ్లు, కల్యాణ మండపాలు, దుకాణాల లీజు వంటి వాటి ద్వారా దాదాపు రూ.197కోట్ల రాబడికి సంబంధించిన అంశాలను ఆమోదించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి పార్కులు, తాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు రూ.1.26 కోట్లు, జీ–20 సదస్సు నేపథ్యంలో ప్రైవేట్ కార్మికులను నియమించినందుకు రూ.28.33కోట్లు, ఏయూలో చెట్ల మార్పు, నూతన మొక్కల ఏర్పాటుకు రూ.39.67కోట్లు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, ఆధునికీకరణకు రూ.26.25 లక్షలు తదితర అంశాలకు సభ్యులు ఆమోదం చెప్పినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. సమావేశంలో కార్యదర్శి పి.నల్లనయ్య, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సీలింగ్ భూములకు సువర్ణావకాశం

- యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణ జీవోల సవరణలు
- అన్ని వర్గాలకూ అవకాశం కల్పించిన ప్రభుత్వం
- 150 గజాల వరకూ ఉచితంగా డీ–పట్టా
- 300 గజాల వరకూ స్థల విలువలో 15 శాతం చెల్లిస్తే పట్టా
- సోమవారం నుంచి ఆక్రమణదారులకు నోటీసులు, దరఖాస్తుల జారీ
- జిల్లాలో 3,024 మంది ఆక్రమణ దారులకు నోటీసులు

సాక్షి, విశాఖపట్నం : పట్టణ భూ పరిమితుల చట్టం (యూఎల్‌సీ) కింద సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించింది. 150 గజాల వరకూ ఉచితంగా డీ పట్టా ఇచ్చేందుకు నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న యూఎల్‌సీ భూముల ఆక్రమణదారులకు రెవెన్యూ యంత్రాంగం నోటీసులు, క్రమబద్ధీకరణ దరఖాస్తులు జారీ చేసే ప్రక్రియను చేపట్టనుంది. జిల్లాలో 2021 నాటికి 86.10 హెక్టార్ల యూఎల్‌సీ భూములు ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణ రుసుమును తగ్గిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.84ను వెలువరించింది. గతంలో జారీ చేసిన జీవో నం. 36లో పొందుపరిచిన షరతులను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విస్తీర్ణంతో సంబంధం లేకుండా క్రమబద్ధీకరణ మొత్తాన్ని బేసిక్ విలువకు 1.5 రెట్లు రుసుం చెల్లించాలన్న నిబంధన ఉండేది. దీన్ని ప్రభుత్వం సవరించి.. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా జీవో తీసుకొచ్చింది. గతంలో దారిద్ర్య రేఖకు ఎగువన, దిగువన ఉన్నవారికి వేరువేరుగా ధరలుండేవి. ఇప్పుడా పరిస్థితి లేకుండా అందరికీ ఒకే విధమైన ధరలు నిర్ణయించడంతో చాలా వెసులుబాటు కలిగిందని లబ్ధిదారులు చెబుతున్నారు. జిల్లాలో 2021లో యూఎల్‌సీ భూములపై చేసిన సర్వే మేరకు మొత్తం 3,024 మంది ఆక్రమణదారుల చెరలో 86.1061 హెక్టార్ల యూఎల్‌సీ భూమి ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ తాజాగా నోటీసులు ఇవ్వనున్నారు.

పదేళ్ల తర్వాత క్రయ విక్రయాలకు అవకాశం

2008 మార్చి 27 నుంచి 2019 మే ఒకటిలోపు రిజిస్టర్ డాక్యుమెంట్లు, ప్రాథమిక పత్రాలు పొందిన వారంతా ఈ క్రమబద్ధీకరణకు అర్హులని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత పట్టా పొందిన లబ్ధిదారులు పూర్తి డబ్బులు చెల్లించిన తర్వాత.. ఆ భూమిని పదేళ్ల తర్వాత బదలాయించుకునే హక్కును కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. కచ్చితంగా రిజిస్టర్ డాక్యుమెంట్ ఉండాలని, అవి లేకపోతే జీవీఎంసీ నుంచి అనుమతి పొందిన ఇంటి ప్లాన్, ఇంటి పన్ను, విద్యుత్ బిల్లు, నీటిపన్ను రసీదులను దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా జత చేయాలని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

తాజా ఉత్తర్వుల ప్రకారం

- 150 చదరపు గజాల వరకూ అర్హత కలిగిన బీపీఎల్, ఏపీఎల్ వర్గాలకు ఉచితంగా డీ–పట్టా అందించనున్నారు.
- 150–300 చ.గజాల వరకూ రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో 15 శాతం చెల్లించాలి.
- 300–500 చ.గజాల వరకూ ఉన్న నిర్మాణాలకు 30 శాతం రుసుం చెల్లించాలి
- 500 చ.గజాల వరకూ ఉన్న వాటికి 100 శాతం రుసుం చెల్లించాలి.
- చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం డబ్బులను జిల్లా జాయింట్ కలెక్టర్, అర్బల్ ల్యాండ్ సీలింగ్ విభాగం, విశాఖపట్నం పేరుతో డీడీ లేదా చెక్ ముందుగా అందించాల్సి ఉంటుంది.
- దరఖాస్తు చేసుకునేందుకు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకూ గడువు విధించారు.
- ఈ ఉత్తర్వులకు ముందు ప్రభుత్వం ఇప్పటికే భూ కేటాయింపు చేసినట్లయినా, ప్రజా ప్రయోజనం కోసం ప్రభుత్వం సదరు భూమిని ఉంచుకోవాలని నిర్ణయించిన వాటికి, ప్రభుత్వం, ప్రభుత్వ ఏజెన్సీ ఆధీనంలో ఉన్న భూములకు ఈ జీవో వర్తించదు.
- దరఖాస్తుల పరిశీలనకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గానూ, జాయింట్ కలెక్టర్ కన్వీనర్, ఆర్‌డీవో, ఎస్‌ఎల్ఆర్ ఏడీ, జిల్లా రిజిస్ట్రార్లు మెంబర్లుగా వ్యవహరిస్తారు.

వారం తర్వాత నుంచి నోటీసులు



యూఎల్‌సీ క్రమబద్ధీకరణపై రాష్ట్ర ప్రభుత్వం అద్భుత అవకాశాన్ని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో గుర్తించిన 3,024 మందికి తహసీల్దారు కార్యాలయాల ద్వారా నోటీసులతో పాటు దరఖాస్తులను అందించే ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశాం. వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన అనంతరం కమిటీ మరోసారి స్క్రూటినీ చేసి సీసీఎల్ఏకు పంపించనుంది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌గానీ, సపోర్టింగ్ పత్రాలతో పాటు అధీకృత ఏజెన్సీలైన జియోకాన్, కశ్యప్ సంస్థలు జారీ చేసిన గూగుల్ మ్యాప్స్ కూడా జత చేయాల్సి ఉంటుంది. వీలైనంత త్వరగా రెగ్యులరైజ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కేఎస్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్

జీవీఎంసీ కమిషనర్‌గా సాయికాంత్ వర్మ



సాయికాంత్



ఆనంద్



పృథ్వీతేజ్



కృష్ణా జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన రాజాబాబు

- ఈపీడీసీఎల్ సీఎండీగా పృథ్వీతేజ్
- కమర్షియల్ ట్యాక్స్ జేసీగా ఆనంద్

అల్లిపురం(విశాఖ దక్షిణ): జీవీఎంసీ కమిషనర్‌గా చిత్తూరి మచ్చరోతు సాయికాంత్ వర్మను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన తొలుత తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ పీవోగా పనిచేశారు. ఈయన స్వస్థలం కర్నూలు. ప్రస్తుత జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు కృష్ణా జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్నారు. ఆయన విశాఖలో తక్కువ కాలం పనిచేసినా.. ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ–20 సదస్సులను సమర్థవంతంగా నిర్వహించేందుకు శ్రమించారు. విశాఖను సుందరంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషిచేశారు. ఆయన సేవలను గుర్తించి కృష్ణా జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అలాగే రెవెన్యూ (సీటీ) విభాగంలో విధులు నిర్వహిస్తున్న 2016 బ్యాచ్‌కు చెందిన ఒ.ఆనంద్‌ను జాయింట్ కమిషనర్(సీటీ)గా నియమించారు. ఇంధన శాఖ డిప్యూటీ సెక్రటరీ, ఏపీపీఎఫ్‌సీ ఎండీగా విధులు నిర్వహిస్తున్న 2018 బ్యాచ్‌కు చెందిన ఇమ్మాది పృథ్వీతేజ్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీగా బదిలీ వస్తున్నారు.

అతిథులను ఆకట్టుకోగలిగాం

జీ–20 సదస్సు విజయవంతంపై మేయర్ హరివెంకట కుమారి



మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి. చిత్రంలో కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: విశాఖలో నిర్వహించిన జీ–20 సదస్సు విజయవంతమైందని, సదస్సుకు విచ్చేసిన అతిథుల్ని ఆకట్టుకోగలిగామని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల సత్య సూర్య శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. 20 దేశాల ప్రతినిధులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ముఖ్యంగా ఫైనాన్సింగ్ ద టుమారో..అర్బన్ లోకల్ బాడీస్, కెపాసిటీ బిల్డింగ్ అన్న విషయాలపై సమగ్రంగా చర్చించారన్నారు. విశాఖ అందాలు, నగర సుందరీకరణకు ప్రపంచ దేశాల ప్రతినిధులు ఎంతో ఆకర్షితులయ్యారన్నారు. అతిథులు మెచ్చేలా ఏర్పాట్లు చేయడంలో జిల్లా అధికారయంత్రాంగం మొత్తం సమష్టి పనిచేసిందన్నారు. అందుకే ప్రపంచ సదస్సులు విజయవంతం చేయగలిగామని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ సిబ్బందిని మేయర్ వెంకట కుమారి, కమిషనర్ రాబాబాబులు అభినందించారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, ఏపీజీబీసీ సంయుక్త ఆధ్వర్యంలో రూ.160 కోట్ల అంచనా వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు.

కౌన్సిల్లో చర్చించాకే..

జీ–20 సదస్సు నేపథ్యంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకునే వారిని తొలగించడం జరిగిందని కమిషనర్ రాజాబాబు చెప్పారు. ఫుట్‌పాత్ వ్యాపారుల కోసం కౌన్సిల్ సమావేశంలో చర్చించాక వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేస్తామన్నారు.

అందరికీ ఆరోగ్యం 'ఫ్యామిలీ డాక్టర్' లక్ష్యం

కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి. చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున

ఆనందపురం (భీమిలి) : అందరికీ ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (కుటుంబ డాక్టర్ విధానం) ప్రవేశపెట్టారని కలెక్టర్ మల్లికార్జున చెప్పారు. మండలంలోని వేములవలసలో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వైద్యం ఎంతో ఖరీదవుతున్న ఈ రోజుల్లో కుటుంబ డాక్టర్ విధానంతో పేదలకు ఉచితంగా ఇంటి వద్దనే వైద్యం లభిస్తోందని చెప్పారు. డాక్టర్‌తో కూడిన వైద్య బృందం 104 వాహనంలో నెలలో రెండు రోజులు ఒక సచివాలయం పరిధిలోని గ్రామాలను సందర్శిస్తారని చెప్పారు. రోగులకు అందించడానికి 67 రకాల మందులను అందుబాటులో ఉంచుతారని వివరించారు. రోగులకు అవసరాన్ని బట్టి 14 రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందిస్తారని చెప్పారు. మెరుగైన సేవలు అవసరమని భావిస్తే పెద్ద ఆస్పత్రులకు పంపించే ఏర్పాట్లు చేస్తారన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత టీడీపీ పాలనలో విద్య, వైద్య రంగాలను దోచుకున్నారని, ప్రభుత్వ రంగాలను గాలికొదిలేశారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వైద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ ప్రవేశ పెట్టి లక్షలాది మంది పేదలకు ప్రాణాలు పోశారని చెప్పారు. ఆయన వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను మంజూరు చేశారని, నాడు–నేడు కింద ఆస్పత్రులలో అన్ని సౌకర్యాలు కల్పించి సామాన్యులకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా వెల్‌నెస్ సెంటర్‌ను కలెక్టర్ మల్లికార్జున సందర్శించి రోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కోరాడ శైలజ, షెషనాజ్, సర్పంచ్‌లు లెంక కొండమ్మ, కోన పైడిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ సూర్యకుమారి, భీమిలి మార్కెట్ కమిటీ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, నాయకులు కోరాడ సాధూ అచ్యుత్ రాంబాబు, కోన శ్రీను, కోరాడ అప్పల స్వామి నాయుడు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, పాండ్రింకి శ్రీను, బొట్టా రామకృష్ణ, డోల దేవుడు పాల్గొన్నారు.



ఆనందపురం మండలం వేములవలసలో రోగి ఇంటికి వెళ్లి సేవలందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్

నేడు కూడా వందేభారత్ రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): శుక్రవారం విశాఖ– సికింద్రాబాద్ (20833)వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఉదయం 5.45గంటలకు బయల్దేరవలసిన వందేభారత్ ఉదయం 9గంటలకు బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ నుంచి విశాఖ వస్తున్న వందే భారత్ రైలుపై ఇటీవల ఖమ్మం – విజయవాడ మధ్యలో దుండగులు జరిపిన రాళ్ల దాడిలో సి–8 కోచ్ అద్దాలు దెబ్బతిన్న విషయం లిసిందే. ఆ కోచ్‌కు సంబంధించిన అద్దాన్ని గురువారం అర్ధరాత్రి విశాఖ చేరుకున్న తరువాత మరమ్మతులు చేశారు. ఈ కారణంగా ఈ రైలు గురువారం కూడా 4 గంటలు ఆలస్యంగా నడిచింది.

అప్పన్న ఉంగరం చోరీ

- ఘనంగా మృగయోత్సవం
- అశ్వవాహనంపై ఊరేగిన అప్పన్న
- నందడిగా స్వామి వార్షిక కల్యాణోత్సవాలు
- నేడు వినోదోత్సవం



శ్రీదేవి,భూదేవి అమ్మవార్లు



నీలుడి వేషధారణలో దారిదోపిడీకి పాల్పడుతున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు



అశ్వవాహనంపై అప్పన్న

సింహాచలం : సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సింహగిరి మాడ వీధుల్లో మృగయోత్సవం (దొంగలదోపు) ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. ఏడు రోజులపాటు జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో ఆరో రోజు రాత్రి నిర్వహించే మృగయోత్సవం వెనుక ఒక కథ ఉంది. చైత్రశుద్ధ ఏకాదశి రోజున కల్యాణోత్సవం జరిపించుకున్న స్వామివారు శ్రీదేవి, భూదేవితో సమేతంగా అటవీ మార్గంలో విహార యాత్రకు వెళ్తుంటారు. భాగవతోత్తములకు నిత్యం తదియారాధన చేస్తూ ఆస్తినంతటినీ పోగొట్టుకున్న నీలుడు అనే పండితోత్తముడు తదియారాధన ఆగకూడదని దొంగగా మారి దారి దోపిడీలకు పాల్పడుతుంటాడు. అటవీ మార్గంలో వెళ్లే వారిని దారికాసి దోచుకుంటుంటాడు. ఆ నగదుతో తదియారాధన కొనసాగిస్తుంటాడు. ఈ తరుణంలోనే అటవీ మార్గంలో విహార యాత్రకు వెళ్తున్న శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి, అమ్మవార్ల ఆభరణాలను కూడా దోచుకుంటాడు. చివరగా అమ్మవారి కాలిమెట్టును తీయడానికి ప్రయత్నించగా అది ఎంతకీరాదు. ఆ సందర్భంలో అతడికి మోక్షోదయమవుతుంది. ఎంత లాగినా అమ్మవారి కాలిమెట్టు రాకపోవడాన్ని గ్రహించిన నీలుడు తాను దొంగిలిస్తున్నది సాక్షాత్తూ లక్ష్మీదేవి అమ్మవారి కాలిమెట్టని గ్రహిస్తాడు. మన్నించమని స్వామిని వేడుకుని ఆభరణాలన్నీ తిరిగిచ్చేస్తాడు. భాగవతోత్తములకు నీలుడు చేస్తున్న తదియారాధనను గ్రహించిన స్వామి అతన్ని ఎంతగానో మెచ్చుకుంటాడు. తన సన్నిధిలో ఉన్న ఆళ్వారుల్లో తిరుమంగై ఆళ్వార్‌గా ఉండే వరాన్ని ప్రసాదిస్తాడు. అనంతరం విహార యాత్ర ముగించుకుని స్వామి ఆలయానికి చేరుకోగానే ఆయన ఉంగరం కనపడకపోవడంతో అమ్మవారు లోపలికి రానివ్వదు. ఉంగరం తీసుకొస్తేనే లోపలికి అనుమతి ఇస్తానని అమ్మవారు అలుగుతుంది. దీంతో స్వామి ఉంగరం వెతుక్కునే వేటలో స్వామి పడతాడు. చివరికి ఆయన చివరి పరదాలోనే ఉంగరం ఉంటుంది. కల్యాతోత్సవాల్లో భాగంగా దారి దోపిడీ జరిగే ఘట్టాన్ని ఆరో రోజు రాత్రి మృగయోత్సవంగాను, ఉంగరాన్ని వెతుక్కునే ఘట్టాన్ని తర్వాత రోజు ఉదయం వినోదోత్సవంగాను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. దీనిలో భాగంగా గురువారం రాత్రి మృగయోత్సవాన్ని ఆలయ వైదిక వర్గాలు విశేషంగా నిర్వహించారు.

ఉత్సవం సాగిందిలా...

శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రాజాయాలంకారం చేసి అశ్వవాహనంపైన, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పల్లకీలోను, తిరుమంగై ఆళ్వారుని వేరొక పల్లకీలోను ఉంచి సింహగిరి మాడా వీధుల్లో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నీలుడిగాను, అతన్ని పట్టుకునేందుకు స్వామి దూతగాను అర్చకులు మాడ వీధిల్లో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. దారిదోపిడీ ఘట్టాలను ఘనంగా నిర్వహించారు. స్వామికి, అమ్మవార్లకు, తిరుమంగై ఆళ్వారుకి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి ఉంగరాన్ని వెతుక్కునే ఘట్టాన్ని శుక్రవారం ఉదయం వినోదోత్సవంగా నిర్వహించనున్నారు.

World Health Day ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు Advt. Feature



ఆరోగ్యమే మహాభాగ్యం

- మారుతున్న జీవనశైలితో వ్యాధులు
- రోజూ వ్యాయామంతో రోగాలు దూరం



నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

మహారాణిపేట: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. పూర్వ కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అనేక విధానాలను పాటించే వారు. ప్రతి ఆచారం వెనుక ఆరోగ్యదాయక క్రియ దాగి ఉండేది. తాత, ముత్తాతల నుంచి వస్తున్న సంప్రదాయ పద్ధతులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. మారుతున్న ఆహార అలవాట్లు.. శారీరక శ్రమ లేకపోవడం.. పని ఒత్తిడి.. వెరసి చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్నాం. మూడు పదుల వయసులోనే మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు చుట్టుముట్టడంతో గుండె, కిడ్నీ, లివర్, కంటి సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. దీనికి తోడు కోవిడ్ 19 వంటి మహమ్మారులు దాడి చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన అవసరం ఏర్పడింది. కోవిడ్ తర్వాత ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం : ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చింది. అందులో భాగంగానే ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ సంవత్సరం 'అందరికీ ఆరోగ్యం' అనే ఇతివృత్తంతో 75 వసంతాల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..

మన ఆరోగ్యం.. మన బాధ్యత. మన ఆరోగ్యాన్ని రక్షించడం కోసం ఎవరో వచ్చి.. ఏదో చేయరు. ఆరోగ్య సంరక్షణలో కీలకమైంది మన జీవనశైలి. పౌష్టికాహారం, బరువు అదుపు, క్రమం తప్పని వ్యాయామం, మానసిక ప్రశాంతత ఉంటే చాలు మన ఆరోగ్యం మన చేతుల్లో ఉన్నట్లే. డబ్బున్నా లేకున్నా, ఎవరైనా.. ఎక్కడైనా మంచి జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. జబ్బుల బారిన పడకుండా హాయిగా, ఆనందంగా జీవించొచ్చు. ఇటీవల కాలంలో మళ్లీ కొవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్వీయ నియంత్రణ అవసరం.

వ్యాయామంతో మేలు

నేటి పోటీ ప్రపంచంలో ఉరుకులు, పరుగులతో దినచర్య ప్రారంభమవుతోంది. ఉద్యోగం, వ్యాపారం, ఇతర వ్యాపకాల దృష్ట్యా రాత్రి ఇంటికి ఆలస్యంగా చేరుతున్న వాళ్లే అధికం. కొందరు మిత్రులతో పార్టీలంటూ అర్ధరాత్రి వరకు నిద్రపోవడం లేదు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. వేకువ జామున నిద్ర లేచి కొంత సమయం నడవడం శ్రేయస్కరం. చిన్నతనం నుంచి పిల్లలను ఉదయాన్నే నిద్ర లేపి వ్యాయామం, ధ్యానం చేయించడం అలవాటు చేయాలి. క్రమం తప్పకుండా చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

వైద్యారోగ్యానికి ప్రాధాన్యం

పటిష్టమైన విద్య, వైద్య రంగాలు అభివృద్ధికి మూల స్తంభాలు. ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఈ దిశగా ప్రజలందరికీ నాణ్యమైన సత్వర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వైద్యులు, సిబ్బంది పోస్టులు ఖాళీలు లేకుండా ఎప్పటికప్పుడు భర్తీ చేస్తోంది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తోంది. 3,255 వ్యాధులకు చికిత్స అందిస్తూ రోగులకు అండగా నిలుస్తోంది. కొత్తగా వైద్య కళాశాలలు నిర్మిస్తోంది. దేశంలోనే వినూత్నంగా ఫ్యామిలీ డాక్టర్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇలా ఎన్నో పథకాలను అమలు చేస్తూ.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

హెల్త్ చెకప్ తప్పనిసరి



వైద్య, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. పేదలకు వైద్య సేవలందించడంలో ముందుంది. ప్రతి ఒక్కరూ ఆహార నియామలు పాటించాలి. కొన్ని అలవాట్లకు దూరంగా ఉండాలి. వయసు పైబడిన వారు రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేసుకోవాలి.

– డాక్టర్ రాధాకృష్ణ,
డిప్యూటీ సూపరింటెండెంట్, కేజీహెచ్



పక్కా కమర్షియల్ సినిమా 'మీటర్'

హీరో కిరణ్ అబ్బవరం

బీచ్‌రోడ్డు: 'మీటర్' పూర్తిగా ఔట్ అండ్ ఔట్ కమర్షియల్ చిత్రమని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం మీటర్ చిత్ర యూనిట్ మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా చిత్ర హీరో కిరణ్ మాట్లాడుతూ తనను ఆదరిస్తున్న విశాఖపట్నం ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. వెటకారంతో కూడిన వినోదాత్మక సినిమా మీటర్ అని.. తన కెరీర్లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిందన్నారు. తండ్రీ కొడుకుల మధ్య జరిగే ఈ కథలో తన పాత్ర(పోలీస్) పూర్తి కొత్తదనంతో ఉంటుందన్నారు. ఇది తాను నటించిన 7వ చిత్రమని, ఈ నెల 7వ తేదీన విడుదలవుతోందన్నారు. మీ డ్రీమ్ రోల్ ఏంటని విలేకరులు ప్రశ్నించగా.. శ్రీమంతుడులో మహేష్‌బాబు పోషించిన పాత్ర చేయాలని చెప్పుకొచ్చిన ఆయన వినరో భాగ్యము విష్ణుకథ సినిమాతో ఆ కల నెరవేరిందన్నారు. చిత్ర దర్శకుడు రమేష్ కాడూరి మాట్లాడుతూ బాబీ, గోపీచంద్ మలినేని వద్ద సహాయకుడిగా పని చేశానని చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్ వంటి పెద్ద సంస్థలో తొలి సినిమా చేయడం సంతోషంగా ఉందని, నిర్మాతలు పూర్తి స్వేచ్ఛనిచ్చారన్నారు. హీరోయిన్ అతుల్య రవి మాట్లాడుతూ తెలుగులో ఇది తన తొలి సినిమా అన్నారు. ఇందుకోసం తెలుగు నేర్చుకున్నానని చెప్పారు. కిరణ్‌తో నటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం చిత్ర యూనిట్ సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకుంది.



మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

అవంతిలో 'మీటర్' బృందం సందడి

తగరపువలస: చెరకుపల్లి అవంతి విద్యా సంస్థలను గురువారం మీటర్ చిత్ర బృందం సందర్శించింది. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్య రవి, డైరెక్టర్ కె.రమేష్ విద్యార్థులతో కలిసి సందడి చేశారు. కామెడీ, యాక్షన్, రొమాంటిక్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయన్నారు. వీరిని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ సన్మానించారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఆనందపురం: జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం మండలంలోని గండిగుండం, పెందుర్తి మండలం ముదపాకలో పర్యటించి అక్కడ నిర్మించనున్న 6వేల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. లేఅవుట్‌లో మౌలిక సౌకర్యాల కల్పనకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమయ్యే నీటి వసతి, విద్యుత్, సిమెంట్, ఇసుక తదితర సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు సహకరించాలన్నారు. గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

బొకారో ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ధన్‌బాద్–అలెప్పీ మధ్య నడుస్తున్న బొకారో ఎక్స్‌ప్రెస్‌కు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, సంబల్‌పూర్ డివిజన్ పరిధి అత్తబిరా స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా హాల్ట్‌ను ఇచ్చేందుకు రైల్వే బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

- ధన్‌బాద్–అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ అత్తబిర స్టేషన్‌కు రోజూ రాత్రి 11.05 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 11.07గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో అత్తబిర స్టేషన్‌కు రోజూ రాత్రి 9.55 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 9.57 గంటలకు బయల్దేరుతుంది. ఈ సదుపాయం శుక్రవారం నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది.



క్రీడలు మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయి



క్రీడల్లో గెలుపొందిన చిన్నారులతో ప్రిన్సిపాల్ రమాదేవి

దొండపర్తి: అభివృద్ధి, శాంతి కోసం ఏటా ఏప్రిల్ 6న అంతర్జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.రమాదేవి అన్నారు. అడవివరంలోని ఎండీఐఎస్‌లో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ డేను గురువారం నిర్వహించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ హెచ్‌వోడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పాట్ యాక్టివిటీస్, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ క్రీడలు పిల్లల శారీరక, మానసిన వికాసాన్ని పెంపొందించడంలో ముఖ్య భూమిక వహిస్తాయన్నారు. వేడుకల్లో ఎండీఐఎస్ ఏసీవో వరలక్ష్మి, యాక్టివిటీ కోఆర్డినేటర్ విద్య, కోర్ ఫ్యాకల్టీ బృందం పాల్గొన్నారు.

అనాథ పిల్లలపై 'మిషన్ వాత్సల్య'ం

మద్రిపాలెం: అనాథ పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకం సద్వినియోగం చేసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు చేపట్టాలని శిశు సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ చిన్మయిదేవి ఆదేశించారు. ఆర్ అండ్ బీ కూడలి వద్ద ఉన్న శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు ఈ పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేసి అర్హత కలిగి ఉన్న పిల్లలను గుర్తించి నమోదు చేయాలన్నారు. కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలని, కేంద్రాలకు వచ్చే పిల్లలకు అవసరమైన ఔషధాలు అందించాలన్నారు. నగరంలోని రెండు సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) ప్రాజెక్ట్‌లను విలీనం చేసినట్లు చెప్పారు. జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వెంకటేశ్వరి, సీడీపీవో ఎం.వి.రమణ కుమారి, అడిషనల్ సీడీపీవో శ్రీలత పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు 111 మంది గైర్హాజరు

ఆరిలోవ: 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు జిల్లాలో 27,537 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. వీరిలో 111 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లా అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న ఎం.జ్యోతికుమారి రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా, తాను ఏడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. స్క్వాడ్ బృందాలు మరో 31 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మాస్ కాపీయింగ్ జరగలేదన్నారు.

సార్వత్రిక పరీక్షలకు 41 మంది.. : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్) పరీక్షలకు 41 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. 10వ తరగతి పరీక్షకు 92 మందిలో 11 మంది, ఇంటర్ పరీక్షకు 445 మందిలో 30 మంది హాజరు కాలేదన్నారు. డీఈవో ఒక పరీక్ష కేంద్రం, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆరు కేంద్రాలను తనిఖీ చేశారు. నడుపూరు పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ ఇంటర్ విద్యార్థి పట్టుబడినట్లు డీఈవో తెలిపారు.



Coronary artery disease (CAD) is an emerging health problem in India; various risk factors contribute to the increased prevalence of CAD in different age groups. Cardiovascular

Acute Myocardial Infarction in Young Individuals

diseases (CVDs) and its complications account for approximately 12 million deaths annually in the Indian subcontinent. As per 2014 statistics by the World Health Organization, 26% of total mortality in India is contributed by CVD. Mortality due to CAD is higher in South India. The mean age for the first presentation of acute myocardial infarction (MI) in Indians is 53 years.

Studies carried out in India, and other places suggest that Asians in general and Indians in particular are at an increased risk of MI at a younger age (<40 years).[4] Heart diseases are rising in Asian Indians and present 5–10 years earlier than in other populations around the world.

Certain risk factors such as family history, obesity, dyslipidemia, and use of tobacco products, are more potent predictors of outcomes in the young than in their older counterparts. Family history of Premature CAD is an important risk factor for young CAD. It stresses the role of genes in the etiology of young CAD. Studies have shown that person with positive family history of PCAD tends to have severe coronary atherosclerosis and is a very strong predictor of future acute coronary event.

Tobacco smoking is an important independent risk factor for CAD in young adults. The risk of CAD begins to decline within months of smoking cessation and disappears within 3–5 years. A few studies have estimated smoking prevalence at 28.5%–30% in Indians living in India. Current smoking of >10 cigarettes or beedi a day is associated with a 6.7-fold increase in the risk of MI.

Indians are genetically prone to develop type-2 diabetes mellitus due to insulin resistance. Hyper insulinemia in these patients accelerates the atherosclerotic process in the coronary arteries. Diabetes is second only to CAD as a health burden in India. During the past decade, the number of people with diabetes in India increased from 32 million to 50 million, and this figure may reach 87 million by 2030. Hyperinsulinemia, insulin resistance, and higher rate of prevalence of metabolic syndrome in people with type-2 diabetes were attributed to high risk for MI in South Asians.

Dyslipidemia is defined as total cholesterol (TC) >200 mg/dl, low-density lipoprotein (LDL) >100 mg/dl, triglycerides (TG) >150 mg/dl, high-density lipoprotein (HDL) <40 mg/dl, according to the NCEP-ATP3 guidelines.[39] An elevated level of TC is the strongest risk factor for CAD. Obesity is a well-established risk factor for CAD, particularly in urban India.

Prevention and control of premature cardiovascular diseases in India need urgent control of these factors. Smoking turned out to be the major risk factor which needs strict prevention. Target oriented control of hypertension, obesity, lipid levels, and glycemia are required. An usual physical activity of 30 mins per day of moderate physical activity for 5 days a week is recommended along with target oriented control of risk factors.

Dr. Chakradhar Pedada
MBBS, MD, DM
Consultant Cardiologist
APOLLO HOSPITALS
Health City, Visakhapatnam

చంద్రబోస్‌కు ఆడారి అభినందనలు



చంద్రబోస్‌ను సత్కరిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: ప్రముఖ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌ను విశాఖలో నోవాటెల్ హోటల్‌లో గురువారం వైఎస్సార్ సీపీ వెస్ట్ ఇన్‌చార్జి, ఏపీ ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు వచ్చిన నేపథ్యంలో ఆయన్ని సత్కరించారు.

ఈపీడీసీఎల్ పరిధిలో సీజీఆర్‌ఎఫ్ సదస్సులు

వివరాలు వెల్లడించిన సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ వెల్లడించారు. ఈ నెల 10న విశాఖపట్నం జోన్–3లోను, 13న శ్రీకాకుళం జిల్లా పలాస సబ్ డివిజన్‌లోను, 18న విజయనగరం జిల్లా గజపతినగరం సబ్ డివిజన్‌లోను, 27న రాజమహేంద్రవరం కోరుకొండ సబ్ డివిజన్‌లోను, 28న ఏలూరులో గోపాలపురం సబ్ డివిజన్ కార్యాలయంలో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై సీజీఆర్‌ఎఫ్ కమిటీకి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. అదేవిధంగా సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్‌ఎఫ్ కార్యాలయానికి వచ్చి లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సదస్సుల్లో సీజీఆర్‌ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, డా. రాయసం సురేంద్రకుమార్ కూడా పాల్గొంటారని తెలిపారు.